శాంతి చర్చల కమిటీకి పార్టీలతో సంబంధం లేదు

● జస్టిస్ చంద్రకుమార్ ప్రకటన

హైదరాబాద్ సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నక్సలైట్లు తక్షణమే హింసను ఆపేసి లొంగిపోవాలంటూ నిజామాబాద్ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మళ్లీ పాత పాటే పాడారని శాంతిచర్చల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్ ఆక్షేపించారు. చర్చలు జరపాలని మావోయిస్టులు సూచిస్తున్నా ప్రభుత్వమే స్పందించడం లేదని విమర్శించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ నక్సలైట్లతో ప్రభుత్వం చర్చలు జరపాలని సూచించారు. మావోయిస్టులు కాల్పుల విరమణను పాటిస్తామంటే హింసను వీడతామని చెప్పినట్లే కదా! అని తెలిపారు. చర్చలు లేకుండానే, లొంగిపోవాలనే ప్రభుత్వాల వైఖరిని మావోయిస్టు నాయకులు సమ్మతించలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం మానవత్వంతో ఆలోచించి మావోయిస్టు పార్టీతో చర్చల దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. నక్సలైట్లకు మద్దతు పలుకుతున్న వారు బాధిత కుటుంబాల పరిస్థితి గురించి కూడా ఆలోచించాలని అమిత్‌షా చేసిన హితవుపైనా చంద్రకుమార్ స్పందించారు. శాంతి చర్చల కమిటీకి ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆదివాసీ ప్రాంతాలలో శాశ్వత శాంతి నెలకొనాలన్నదే ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్తులో ప్రాణనష్టం తలెత్తకుండా ఉండడానికి శాంతి చర్చలమార్గమే ఏకైక పరిష్కారమని శాంతి చర్చల కమిటీ కార్యనిర్వాహకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ సూచించారు.

ఎడారి దేశంలో జనసేన వీరమహిళ ఆపన్నహస్తం

● రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హైదరాబాద్ యువతి
● మృత్యువు నుంచి బయటపడినా ఒంటరిగా మిగిలిన వైనం
● బాధితురాలికి అండగా విశాఖ మహిళ ఉష
● 2,200 కిలోమీటర్లు ప్రయాణించి ఇండియాకు పంపిన వైనం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఆమె ఓ తెలుగు నర్సు. సేవే పరమావధిగా గల్ఫ్‌లోని బిషా అనే ఎడారి ప్రాంతంలో వేలాది మంది రోగులకు సేవలందిస్తోంది. అలాంటి ఆమె కొంత కాలం క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ప్రమాదం నుంచి మృత్యుంజయరాలిగా బయటపడినా.. పరాయిగడ్డపై ఆత్మీయులు కొరవడి ఏకాకిగా మిగిలింది. ఆ సమయంలో రియాద్‌లో ఉంటున్న జనసేన పార్టీ విశాఖపట్నానికి చెందిన ఓ వీర మహిళ తానున్నానంటూ బాధితురాలికి ఆపన్న హస్తం అందించింది. సౌదీలో 2,200కిలో మీటర్ల దూరం ప్రయాణం చేసి ఆమెను సోమవారం స్వదేశానికి పంపించింది. వివరాలివీ.. సౌదీ అరేబియాలోని బిషా అనే ఎడారి ప్రాంతంలో ఓ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన 34 ఏళ్ల గిరిజన యువతి ఒకరు కొద్ది కాలం క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. మృత్యువు నుంచి బయటపడినా మెదడు, వెన్నుపూస, కాళ్లు, చేతులకు అనేక శస్త్రచికిత్సలు జరిగాయి. మెరుగైన వైద్య సదుపాయం అందించినా.. ఆమె ఇంకా పూర్తిగా కోలుకోలేదు. మానసికంగా కుంగిపోయి కన్నీరు మున్నీరవుతోంది. ఈ నేపథ్యంలో ఆమె దయనీయ పరిసితి తెలుసుకుని రియాద్‌లో ఉంటున్న విశాఖపట్నానికి చెందిన చెందిన జనసేన పార్టీ వీరమహిళ, సామాజిక కార్యకర్త దుగ్గారపు ఉష చలించిపోయారు. ఓవైపు తనకు ఆరోగ్యం బాగోలేకపోగా, మరోవైపు పిల్లలకు పరీక్షలు ఉన్నప్పటికీ.. వారిని ఇంట్లో ఒంటరిగా విడిచిపెట్టి బాధితురాలి కోసం ఆమె ఉన్న ఆస్పత్రికి అతికష్టమ్మీద వెళ్లారు. రియాద్ నుంచి 800 కిలోమీటర్ల దూరంలోని బిషాకు లోకల్ ఫ్లైట్‌లో వెళ్లి, బాధితురాలిని మరో 700 కిలోమీటర్ల దూరంలోని జెద్దాకు ఫ్లైట్‌లో తరలించారు. అక్కడి నుంచి అంతర్జాతీయ విమానంలో ఇండియాకు బాధితురాలిని పంపించి, తిరిగి మరో 700 కిలో మీటర్లు ప్రయాణించి రియాద్ చేరుకున్నారు. సమయానికి విమానాలు అందుబాటులో లేకపోగా, నాలుగైదు రోజులు శ్రమపడి మొత్తంగా రెండువేల కిలోమీటర్లకు పైగా ఏడారిలో ప్రయాణించారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్ఫూర్తితో సేవలో తనకు అలసట కనిపించదని ఉష ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని, అప్పుడే తన శ్రమకు తగిన తృప్తి అని ఆమె చెప్పారు.

దక్షిణమధ్యరైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఉద్యోగ విరమణ



జీఎంకు జ్ఞాపికను బహూకరిస్తున్న దక్షిణమధ్యరైల్వే ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా సుదీర్ఘకాలం పాటు పనిచేసిన అరుణ్ కుమార్‌జైన్ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు ఉన్నతాధికారులు, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి ఘనంగా వీడ్కోలు పలికారు. 2022లో దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా అరుణ్ కుమార్ జైన్ బాధ్యతలు స్వీకరించారు. రైల్ నిలయంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన హయాంలో దక్షిణ మధ్య రైల్వే అనేక గొప్ప విజయాలు సాధించడానికి అవిశ్రాంతంగా కృషిచేసిన అధికారులు, ఉద్యోగులను ప్రశంసించారు. అంతకు ముందు మౌలాలిలోని ఆర్‌పీఎఫ్ శిక్షణ కేంద్రంలో ఆయనకు గౌరవ, కృతజ్ఞతా చిహ్నంగా ప్రత్యేక వీడ్కోలు పరేడ్ నిర్వహించారు. అరుణ్‌కుమార్ జైన్ స్థానంలో సౌత్‌కోస్టల్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్‌కు ఇన్‌చార్జ్ జీఎంగా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారని అధికారులు తెలిపారు.

స్వేచ్ఛ కుటుంబ సభ్యులపై వేధింపులు ఆపాలి

● ఇబ్బందికరంగా కొన్ని మీడియా సంస్థల తీరు
● మీడియాతో కలెక్టివ్ ఆఫ్ విమెన్ జర్నలిస్ట్స్

పంజాగుట్ట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన టీవీ యాంకర్ స్వేచ్ఛ కుటుంబ సభ్యులపై వేధింపులు ఆపాలని, దోషులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టివ్ ఆఫ్ వుమెన్ జర్నలిస్ట్స్ డిమాండ్ చేశారు. స్వేచ్ఛ మైనర్ కుమార్తెను చూపించే వీడియోలు, థంబ్‌నెయిల్‌లను వెంటనే తొలగించాలని కోరారు. కేసు దర్యాప్తు చేసే పోలీస్ అధికారులే లీకేజీలు ఇస్తున్నారని, ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా జర్నలిస్టులు సి.వనజ, కట్ట కవిత, వైకృష్ణ జ్యోతి, సలీమా, రాజేశ్వరి, పద్మ, భూమిక సత్యవతి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మీడియా సంస్థల యాజమాన్యాలు, ఎడిటర్లకు రాసిన బహిరంగ లేఖను వారు విడుదల చేశారు. చట్టపరమైన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోకుండా కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న హడావిడిని యావత్ సమాజం ఈసడించుకుంటుందన్నారు. బాధలో ఉన్న స్వేచ్ఛ కుటుంబ సభ్యులను మరింతగా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఈ విషయమై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఎడిటర్స్‌గిల్డ్‌కు లేఖ రాస్తామన్నారు.

పూర్ణచందర్‌ను కస్టడీకి ఇవ్వాలని పోలీసుల పిటిషన్

చిక్కడపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో అరెస్ట్ అయిన నిందితుడు పూర్ణచందర్‌ను ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ చిక్కడపల్లి పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

స్కూటర్ డిక్కీలో నుంచి రూ.6.5లక్షల నగదు చోరీ

చాదర్‌ఘాట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): స్కూటర్ డిక్కీలో నుంచి రూ.6.5లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట మార్కెట్లో షేక్ ఖుద్దూస్ ఉల్లిగడ్డల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. సోమవారం వ్యాపార లావాదేవీల అనంతరం రూ.6.5లక్షల నగదును తన బర్గ్‌మన్ స్కూటర్ డిక్కీలో పెట్టుకుని, షాపు ముందు పార్క్‌చేసి లోనికి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి చూడగా స్కూటర్ డిక్కీలో ఉంచిన నగదు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులే తన స్కూటర్‌లోని నగదును చోరీ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ ఘటనపై పోలీసులు సీసీ ఫుటేజీ లను పరిశీలిస్తున్నారు. దొంగను పట్టుకునేందుకు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. షాపు ముందు స్కూటర్‌ను పార్క్ చేసి ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బురఖా ధరించి సంచరించినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు చాదర్ ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కోహెడలో అత్యాధునిక హంగులతో అంతర్జాతీయ మార్కెట్

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోహెడలో అత్యాధునిక హంగులతో అంతర్జాతీయ మార్కెట్ రాబోతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వెల్లడించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చే రైతులకు అసౌకర్యం కలుగకుండా మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సోమవారం నగరశివారు బాటసింగారంలోని ఫ్రూట్ మార్కెట్ అభివృద్ధిపై గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్, మార్కెటింగ్ శాఖ అధికారులకు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. మార్కెట్ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఫ్రూట్ మార్కెట్‌లో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఆయా మార్కెట్‌లలో రైతులను మోసం చేస్తున్న దళారులను సహించేది లేదన్నారు. రైతుల కోసం నిలబడే బాధ్యత తమపై ఉందన్నారు. మార్కెట్‌కు సరుకు తీసుకువచ్చే రైతుల వద్ద 12శాతం కమిషన్‌ను వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, నిబంధనల ప్రకారం 4శాతం మాత్రమే వసూలు చేయాలని సూచించారు. రైతులను మోసం చేయాలని చూస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. 4శాతం కంటే ఎక్కువ కమిషన్ వసూలు చేస్తే వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ రవికుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్, డీఈ రవీందర్, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

● ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్



శాంతియుత దీక్షలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు

హయత్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరుతూ సోమవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతియుత దీక్ష చేశారు. దీక్షకు సీపీఐ, సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర కోసం సంవత్సరాల తరబడి పోరాటం చేశామన్నారు. కుటుంబాలను సైతం పట్టించుకోకుండా ప్రత్యేక రాష్ట్ర కోసం కృషి చేయడం జరిగిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఇచ్చి 250 గజాల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులను గుర్తించి ఐడీ కార్డులు అందించాలన్నారు. ఉద్యమకారులకు నెలకు రూ.25వేల పెన్షన్, 10వేల కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి, గుర్రం గోపాల్‌రెడ్డి, ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెనిగే విష్ణువర్ధన్, జోర్క రాము ముదిరాజ్, స్కైలాబ్, నరేందర్, శ్యామల, బలరాం, చిత్రం కృష్ణ, బాబులాల్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తేనే ఉద్యోగులకు సరైన గౌరవం

● మీర్‌పేట్ కమిషనర్, బడంగ్‌పేట్ ఎస్‌ఏ ఉద్యోగ విరమణ సభల్లో వక్తలు



జ్ఞానేశ్వర్ ఉద్యోగ విరమణ సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, పాల్గొన్న టఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా తదితరులు

సరూర్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పదవిలో కొనసాగినన్ని రోజులు ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా, చిత్తశుద్ధితో నిర్వహిస్తేనే ఉద్యోగులకు సరైన గౌరవం దక్కుతుందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారంతో తన పదవీ కాలాన్ని ముగించుకుని ఉద్యోగ విరమణ పొందుతున్న మీర్‌పేట్ మునిసిపల్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ సన్మానసభ సోమవారం జిల్లెలగూడలోని ఎస్‌వైఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సబిత, చల్లా జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఉద్యోగానికి మాత్రమే విరమణ ఉంటుందని, బాధ్యతలకు కాదని అన్నారు. జ్ఞానేశ్వర్ పంచాయతీ కార్యదర్శిగా, మునిసిపల్ మేనేజర్‌గా, కమిషనర్‌గా ఎంతో నిబద్ధతతో పనిచేశారని, ఉద్యోగులందరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్లు, పలు మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, పలు పార్టీలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది..

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన వెంకటనారాయణరెడ్డి ఉద్యోగ విరమణ సన్మానసభ సోమవారం స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సబిత, పారిజాత ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యా యత్నం

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో ఓ యువతి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన దిల్‌సుఖ్‌నగర్‌లో చోటు చేసుకుంది. నారాయణపేట జిల్లాలోని మక్తల్ నేతాజీనగర్‌కు చెందిన వి.సుష్మిత దిల్‌సుఖ్‌నగర్‌లో అక్షయ డీలక్స్ గర్ల్స్ హాస్టల్‌లో ఉంటూ మహాత్మాగాంధీ కాలేజీలో ఎల్ఎల్‌బీ చదువుతోంది. నెల రోజుల క్రితం యువతి తల్లి పెరాలసిస్ వ్యాధితో చనిపోవడంతో మనస్థాపానికి గురై బాధపడుతోంది. సోమవారం తాను ఉండే హాస్టల్ 4వ అంతస్తు నుంచి దూకింది. దీంతో ఆమె రెండు కాళ్లకు గాయాలు కాగా, హాస్టల్ యాజమాన్యం వెంటనే కొత్తపేటలోని ఓమ్ని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతోందని సరూర్‌నగర్ పోలీసులు తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే చెరువుల సుందరీకరణకు నిధులు

● ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్ : మహేశ్వరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చెరువుల సుందరీకరణకు బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనే నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా ఒక్క పైసా కూడా ఇవ్వలేదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి విమర్శించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడ చెరువు వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను సోమవారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చెరువు చుట్టూ తిరిగి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబిత మాట్లాడుతూ చెరువు సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలని, పనులు తొందరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ మునిసిపల్ డీఈఈలు యాదయ్య, వెంకన్న, మాజీ కార్పొరేటర్ రోహిణీరమేశ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

చైతన్యపురిలో అగ్నిప్రమాదం



మంటలను అదుపులోకి తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ సంభవించి రెండు లక్షల విలువ చేసే గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చైతన్యపురి డివిజన్ న్యూమారుతినగర్‌కాలనీలో నివాసం ఉండే శ్రీనివాస్ ఇంట్లో సోమవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎల్బీనగర్ ఫైర్ స్టేషన్ అధికారి శ్రీధర్ బృందం, హైడ్రా, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే ఇంట్లోని సుమారు రూ.2లక్షల విలువ చేసే గృహోపకరణాలు దగ్ధమైనవి. శ్రీనివాస్ కుమారుడు ప్రణవ్ కాలుకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత.. గాంధీలో చికిత్స పొందుతూ మృతి

కొత్తపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత గాంధీలో చికిత్స పొందుతూ.. మృతిచెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కాగా.. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రియుడి వల్లే ఆమె ఆత్మహత్యాయత్నం చేసిందని, అతనికి వీడియోకాల్ చేసి మరీ ఆమె ఆత్మహత్యాయత్నం చేసిందంటూ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం బోడల దిన్నెకు చెందిన అశ్విని(35) తన భర్త తమ కుమార్తెతో కలిసి హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ఉంటున్నారు. నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె వారి గ్రామానికి చెందిన తెలిసిన వ్యక్తికి వీడియోకాల్ చేసి, చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తెలిపింది. వారి గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో విషయం తెలుసుకున్న వెంటనే అశ్విని ఇంటికి వెళ్లి పక్కంటి వారి సహకారంతో ఆమెను కాపాడే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో భర్త వచ్చాడు. ఆమె భర్తతో కలిసి చికిత్స నిమిత్తం అశ్వినిని తొలుత దగ్గరలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అశ్విని ఆదివారం రాత్రి మృతిచెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

● అలాంటిదేమీ మా దృష్టికి రాలేదు..

ఇదిలా ఉండగా.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విధంగా మృతురాలిని రక్షించే యత్నం చేసిన సదరు యువకుడితో వివాహేతర సంబంధం ఉందనీ, అతని వల్లే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందనే విషయాలేవీ మా దృష్టికి రాలేదు. తన భార్య ఆత్మహత్యాయత్నం చేసిందని మాత్రమే ఫిర్యాదు చేశాడని, ఆ యువకుడికి సంబంధించిన ఎలాంటి విషయాలు వెల్లడించలేదని, ఫిర్యాదులోనూ పేర్కొనలేదని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు.

రూ.34లక్షలతో అభివృద్ధి పనులు : బలాల

చాదర్‌ఘాట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట కాలాడేర, గచ్చిబౌలి బస్తీలో స్థానికుల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టేందు కు ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. సోమవారం మలక్‌పేట కాలాడేర, గచ్చిబౌలి బస్తీలో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, మరో రూ.15లక్షలతో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నట్లు తెలిపారు. రూ.6లక్షలతో నిర్మిస్తున్న బాక్స్‌డ్రెయిన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్పొరేటర్ మిన్హాజుద్దీన్ పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్, రిమాండ్

వనస్థలిపురం : హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ టి.మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 26 రాత్రి హయత్‌నగర్ కుమ్మరికుంట సాయినగర్‌కాలనీకి చెందిన పోలవరపు తాండవ కృష్ణ తన స్నేహితులైన ఎస్.సాయి మల్లికార్జున్ రాజు, మాచర్ల సంతోష్, సతీష్, ఎ.తరుణ్‌లతో కలిసి సామానగర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్ ముందు నిల్చుని మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న సాయి యువబార్ నుంచి బయటకు వచ్చిన సాహెబ్‌నగర్‌కు చెందిన నందగిరి రాజుగౌడ్ మద్యం మత్తులో తాండవ కృష్ణతో పాటు అతని స్నేహితులతో గొడవ పడి తన వద్ద ఉన్న కత్తితో తాండవ కృష్ణ కడుపులో పొడిచి అక్కడ నుంచి పారిపోయిన విషయం తెలిసిందే. దీంతో తీవ్ర గాయాలైన తాండవ కృష్ణను అతని స్నేహితులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి ఆచూకీ కోసం తీవ్రంగా గాలించి ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మన్సూరాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నిలిచున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవా రం జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. జీడిమెట్లలోని సుభాష్‌నగర్ లాస్ట్ బస్టాప్ వద్ద నివాసముండే బండారి విజయ్‌కుమార్(35) ఇంటర్నెట్ కనెక్షన్ సెంటర్‌లో పని చేయడంతో పాటు ఖాళీ సమయాల్లో తన ద్విచక్రవాహనం(టీఎస్08జేకే2743)పై ర్యాపిడో రైడ్స్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి సుమారు 11.45గంటల సమయంలో నాగోల్ భారత్ పెట్రోల్ బంక్ వద్ద వేచి ఉండగా ఉప్పల్‌నుంచి బండ్లగూడ వైపు వెళ్తున్న లారీ(టీఎస్07యూజే9339) ఢీకొట్టింది. ఈ ఘటనలో విజయ్‌కుమార్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు బండారి సురేష్ ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన దారమల్ల అశోక్(27) కొంత కాలంగా స్నేహితులతో కలిసి తొర్రూర్ గ్రామంలో నివాసం ఉంటూ ఉద్యోగం కోసం చూస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి అబ్దుల్లాపూర్‌మెట్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో తమ బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో అక్కడికి వెళ్లాడు. ఫంక్షన్ ముగిసిన అనంతరం అశోక్ మరో బంధువు వాహనంపై విజయవాడ జాతీయ రహదారి రమాదేవి స్కూల్ యూటర్న్ వద్ద దిగాడు. అదే సమయంలో అతడు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరేళ్ల తమ్ముడితో టీవీ రిమోట్ కోసం గొడవ మనస్థాపంతో అక్క ఆత్మహత్య

సైదాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తనకు టీవీ రిమోట్ ఇవ్వలేదని ఆరేళ్ల తమ్ముడిని గొడవపడి కొట్టిన ఓ అక్క మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. వినయ్‌నగర్‌కాలనీలో నివాసముండే వీరబోయిన మల్లిక, వెంకన్న దంపతులకు ముగ్గురు సంతానం, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మల్లిక వినయ్‌నగర్‌లోని భోజ్‌రెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో లెక్చరర్, ఫిజికల్ డైరక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నది. ఇటీవల ఇంటర్ పూర్తి చేసుకున్న ధృతి చందన(16) ఆదివారం రాత్రి ఆరేళ్ల తమ్ముడితో కలిసి టీవీ చూస్తుంది. తనకు ఇష్టమైన ఛానల్ చూడనివ్వడం లేదని తమ్ముడితో గొడవకు దిగింది. చందన కోపంతో తమ్ముడిని వీపు మీద విపరీతంగా కొట్టి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కొద్దిసేపటికి తండ్రి వెంకన్న ఇంట్లోకి వచ్చి గది తలుపులు కొట్టిన చందన తీయకపోవడంతో వాటిని పగులగొట్టి చూడగా కూతురు ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. వెంటనే కిందికి దించి సమీపంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ షోరూంలో చోరీ



మొబైల్ షోరూంలోకి వేసిన కన్నం

చాదర్‌ఘాట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని బిగ్ సీ మొబైల్ షోరూంలో సోమవారం చోరీ జరిగింది. ఉదయం యథావిధిగా షోరూం తెరిచిన సిబ్బంది మొబైల్ ఫోన్లు చోరీకి గురైనట్లుగా గుర్తించి మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు రంగంలోకి దిగిన మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి.నరేష్‌తోపాటు క్రైం సిబ్బంది వివరాలు సేకరించారు. షోరూం పక్కనున్న మెట్ల మార్గం నుంచి షోరూంలోకి కన్నం వేసినట్లుగా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తి ఈ కన్నంలో నుంచి షోరూంలోకి ప్రవేశించి విలువైన మొబైల్ ఫోన్లను చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. చోరీకి గురైన మొబైల్ ఫోన్ల విలువ రూ.5లక్షల వరకు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

డీసీపీ సందర్శన..

చోరీకి పాల్పడిన మొబైల్ షోరూంను సౌత్‌ఈస్ట్‌జోన్ డీసీపీ చైతన్యకుమార్, మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి సందర్శించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపి ఆధారాలను సేకరిస్తున్నారు.